సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 6 । మే । 2024



పోలీసు యంత్రాంగం అప్రమత్తం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. 8లో



నాటు పడవ బోల్తా.. ఒకరి మృతి

జోలాపుట్టులో నాటు పడవ బోల్తా పడిన ఘటనలో గిరిజనుడు మృతి చెందాడు. 8లో



ఆకట్టుకున్న ఉదయ భానుడు

సాక్షి,పాడేరు: లగిశపల్లి రోడ్డులో తెలికపాటి మంచు తెరలను చీల్చుకుంటూ ఉదయ భానుడు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాడు.

పింఛన్ల పంపిణీలో రాష్ట్రంలో ప్రథమస్థానం

- కలెక్టర్ విజయ సునీత

సాక్షి,పాడేరు: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ ఎం.విజయసునీత తెలిపారు. జిల్లా లో మొత్తం1,27,435 మంది పింఛనుదారు ల్లో 99.73 శాతం మందికి పంపిణీ చేసి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన డీఆర్డీఏ పీడీ మురళి, ఎల్డీఎం రవితేజ, బ్యాంకర్లు, ఎంపీడీవోలు, గ్రామసచివాలయాల ఉద్యోగులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

- 1228 మంది ప్రభుత్వ ఉద్యోగులు వినియోగం
- 68 మంది హోం ఓటింగ్
- కలెక్టర్ విజయ సునీత



పాడేరు ఆర్వో భావన నుంచి పోస్టల్ బ్యాలెట్లు పొందుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

సాక్షి,పాడేరు: జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో ఆదివారం 1222 మంది ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ ఎం.విజయసునీత ఓ ప్రకటనలో తెలిపారు. వృద్ధులు,దివ్యాంగులు 68 మంది హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకున్నారన్నారు. అరకులోయ నియోజకవర్గంలో 288 పోస్టల్ బ్యాలెట్, 24మంది హోం ఓటింగ్, పాడేరు నియోజకవర్గంలో 387 మంది పోస్టల్ బ్యాలెట్, 37 మంది హోం ఓటింగ్, రంపచోడవరం నియోజకవర్గంలో 547మంది పోస్టల్ బ్యాలెట్, ఏడుగురు హోం ఓటింగ్‌లో పాల్గొన్నారని ఆమె తెలిపారు. ఈ ప్రక్రియను మూడు నియోజకవర్గాల ఆర్వోలు భావన వశిష్ట, వి.అభిషేక్, ప్రశాంత్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పరిశీలన

రంపచోడవరం: స్థానిక గిరిజన సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఆదివారం ఆర్వో ప్రశాంత్‌కుమార్‌తో కలిసి సాధారణ ఎన్నికల పరిశీలకుడు కె. వివేక్ నందన్ పరిశీలించారు. అనంతరం గురుకుల బాలికల కళాశాలలో స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. డిగ్రీ కళాశాల వద్ద హెలీప్యాడ్‌ను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు, సిబ్బంది తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించే లక్ష్యంతో చర్యలు చేపట్టామని ఆయన పేర్కొన్నారు.

- ఆపత్కాలంలో ఆపన్నహస్తం

కన్నీటి సుడులు.. కరిగె సూరీడు





- ఎల్‌జీ పాలిమర్స్, హార్బర్ ప్రమాద సమయాల్లో అండగా ప్రభుత్వం
- యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు.. 48 గంటల్లోనే బాధితులకు పరిహారం
- మనసున్న ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌కు జన నీరాజనాలు
- టీడీపీ హయాంలో సహాయం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- హుద్‌హుద్ బాధితులకు పరిహారం అందించని చంద్రబాబు

విశాఖ సిటీ : చంద్రబాబుకు అరచేతిలో వైకుంఠం చూపించడంలో 40 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఏ సంఘటనైనా, ప్రమాదమైనా తన రాజకీయ లబ్ధికి వినియోగించుకుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాద బాధితులకు సత్వర సాయం అందించాలని పరితపించారు. టీడీపీ హయాంలో సంభవించిన విపత్కర పరిస్థితుల్లో హడావుడి, ప్రచార ఆర్భాటాలకే పరిమితమైతే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలపై దృష్టి సారించింది. అప్పట్లో నష్టపరిహారం కోసం బాధితులు ఏళ్ల తరబడి వేచి చూడాల్సి రాగా.. ఈ ప్రభుత్వం ప్రమాదం జరిగిన గంటల్లోనే బాధితుల బ్యాంకు **ఖాతాల్లో పరిహారం జమచేసింది. ఒకవైపు సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రమాద సమయాల్లో గత, ప్రస్తుత ప్రభుత్వాలు స్పందించి సహాయం అందించిన తీరుపై ఓటర్ల మధ్య ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అప్పట్లో హుద్‌హుద్ తుపాను** సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు గాలికి కొట్టుకుపోయాయి. ఈ ఐదేళ్లలో ఎల్‌జీ పాలిమర్స్, హార్బర్ ఘటనల్లోను, అలాగే వరదలతో పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా అల్లూరి జిల్లాలో నాలుగు మండలాలు నీట మునిగిన సమయంలో ప్రభుత్వం కేవలం 72 గంటల్లోనే బాధితులకు నష్ట పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

గంటల్లోనే పరిహారం

2020, మే 7వ తేదీన జరిగిన ఎల్‌జీ పాలి**మర్స్ ప్రమాదంలో 12 మ**ంది మృత్యువాతపడ్డారు. **అనేక మంది అనారోగ్యం** బారిన పడ్డారు. దీంతో **ప్రభుత్వం యుద్ధ ప్రాతిప**దికన ఆ పరిశ్రమ చుట్టు **పక్కల గ్రామాలను తరలిం**చింది. వారందరికీ వారం **రోజుల పాటు ప్రత్యేక వస**తి సౌకర్యాలు కల్పించింది. **అలాగే మృతుల కుటుంబా**లకు రూ.కోటి, ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి రూ.10 లక్షలు, ఆ ప్రాంతంలో ఉన్న ఒక్కరికీ రూ.10 వేలు చొప్పున నష్టపరిహారం కేవలం మూడు నుంచి వారం రోజుల్లోనే అందించింది. అంత భారీ స్థాయిలో పరిహారం సీఎం జగన్ ప్రకటించడంతో ప్రతిపక్షాల సైతం నోరెళ్లబెట్టాయి.

రాజకీయ లబ్ధికే చంద్రబాబు ఆరాటం

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి ప్రమాదాన్ని చంద్రబాబు తమ రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి తిష్టవేయడం.. మూడు, నాలుగు రోజులు దగ్గరుండి పనిచేస్తున్నట్లు హడావుడి, ప్రచార ఆర్భాటలు చేయడం.. అనుకూల మీడియాలో బాకాలు ఊదించుకోవడం.. బాధితులకు నష్టపరిహారం అందించేస్తామని చెప్పి వెళ్లిపోవడం.. ఇదీ ప్రతి ప్రమాద సమయంలోను జరిగిన తంతు. కానీ నెలలు, ఏళ్లు గడిచినా ఆ పరిహారం బాధితులకు అందించిన దాఖలాలు లేవు. అందుకు విశాఖలో హుద్‌హుద్ తుపాను ఘటనే నిదర్శనం. 2014, అక్టోబర్ 12వ తేదీన విశాఖను హుద్‌హుద్ తుపాను అతలాకుతలం చేసింది. రూ.వందల కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. చంద్రబాబు విశాఖకు వచ్చి వారం రోజుల పాటు కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాలతో కాలయాపన చేశారు. రోజంతా సమీక్షలు చేయడంతో సహాయక చర్యలు ఆలస్యమయ్యాయి. అలాగే దేశ, విదేశాల నుంచే కాకుండా కార్పొరేట్, ప్రైవేటు దాతల నుంచి రూ.వందల కోట్ల విరాళాలు వచ్చాయి. వాటితో మత్స్యకారుల కోసం ప్రత్యేక కాలనీలు నిర్మిస్తానని, నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందిస్తానని చెప్పి వెళ్లిపోయారు. కేవలం రెండు చోట్ల గ్రూప్ హౌసింగ్ నిర్మాణాలు చేసి చేతులు దులిపేసుకున్నారు. తరువాత వారికి ఎటువంటి పరిహారం అందించలేదు. అనేక మంది పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా పైసా కూడా విదిల్చలేదు.



హార్బర్ ప్రమాదంలో మూడో రోజే పరిహారం

2023, నవంబర్ 19న ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 49 బోట్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదాన్ని కూడా చంద్రబాబు రాజకీయ లబ్ధికి వినియోగించుకోవాలని ప్రయత్నించింది. మత్స్యకారులను ప్రభుత్వంపై రెచ్చగెట్టేందుకు విశ్వప్రయత్నాలు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం చంద్రబాబు, ఇతర పార్టీలకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఎప్పటిలాగే ప్రమాదం జరిగిన మూడో రోజే నష్టపోయిన బోటు యజమానులకు రూ.7.11 కోట్లు అందజేసింది. అలాగే బోట్లపై ఆధారపడి జీవనోపాధి కోల్పోయిన 400 మంది కలాసీలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది.

మనసున్న ముఖ్యమంత్రి జగన్

ప్రమాద, విపత్కర పరిస్థితుల్లోను చేతికి ఎముక లేదు అన్న చందంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు సహాయం అందిస్తూ వస్తున్నారు. చంద్రబాబులా ప్రమాదాలలో రాజకీయ లబ్ధి కోసం పాకులాడకుండా.. బాధితులను ఆదుకోవడమే ప్రథమ కర్తవ్యంగా భావించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆయా ప్రాంతానికి వెళ్లి హడావుడి, ప్రచార ఆర్భాటాలు చేయకుండా యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేస్తూ.. బాధితులకు పరిహారం కూడా రెండు, మూడు రోజుల్లోనే అందించారు. ఆ తరువాతే సీఎం జగన్ బాధితులను పరామర్శిస్తూ వారికి పరిహారం అందిందా? లేదా? అని మరోసారి వాకబు చేస్తూ మనసున్న ముఖ్యమంత్రిగా నిరూపించుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అప్పటి టీడీపీకి.. ఇప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన మేలుపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

ఊహించని పరిహారం



ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదం అత్యంత బాధాకరం. మా ప్రాణాలు పోతాయనుకున్నాం. ఈ సమయంలో ప్రభుత్వం సత్వరమే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. వేలాది మందికి వసతి సౌకర్యాలు కల్పించింది. ఒకవైపు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి మెరుగైన వైద్యం అందిస్తూనే.. మరోవైపు పునరావాస కేంద్రాల్లో వారం రోజుల పాటు భోజన వసతి ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబాలన్నింటికీ ఊహించని విధంగా నష్టపరిహారం అందించింది.

– ఎస్.మారయ్య, పద్మనాభనగర్

సీఎం జగన్ దేవుడిలా ఆదుకున్నారు



అగ్ని ప్రమాదం కారణంగా నా బోటు దగ్ధమైంది. జీవనోపాధి దూరమై కుటుంబం రోడ్డు మీద పడిపోయిందని భయపడ్డాను. కానీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి దేవుడిలా ఆదుకున్నారు. నష్టపోయిన బోటుకు 80 శాతం పరిహారాన్ని కేవలం మూడు రోజుల్లోనే ప్రభుత్వం అందించింది. ఇప్పుడు మళ్లీ కొత్త బోటును కొనుగోలు చేసుకున్నాను. ఇంత వేగంగా పరిహారం అందించిన ఏకైక ప్రభుత్వం ఇదే.

– యాగ శ్రీనివాసరావు, బోటు యజమాని



గోదావరి వరదల సమయంలోనూ..

భారీ వర్షాలు కారణంగా గోదావరి పోటెత్తింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలు నీట మునిగాయి. కొన్ని ఇళ్లు పూర్తిగాను, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. తాను పర్యటనకు వచ్చేలోగా సహాయక చర్యలతో పాటు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని చెప్పారు. దీంతో పాక్షికంగా దెబ్బతిన్న సుమారు 20 వేల ఇళ్లకు రూ.2 వేలు చొప్పున మూడు రోజుల్లోనే పరిహారం అందించారు. నాలుగో రోజు సీఎం చింతూరులో పర్యటించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ పరిహారం అందిందని జగన్‌ను పొగడ్తలతో ముంచెత్తారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం

- ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థులను గెలిపించండి
- టీడీపీ, బీజేపీ, జనసేన నేతల మాటలు నమ్మి మళ్లీ మోసపోవద్దు
- వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- అరకులోయలో భారీ బైక్ ర్యాలీ
- జైజగన్ నినాదంతో హోరెత్తిన అరకులోయ



అరకులోయలో వైఎస్సార్ సీపీ శ్రేణుల ర్యాలీ



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అభ్యర్థులు మత్స్యలింగం, తనూజారాణి

అరకులోయ టౌన్: పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. ఆదివారం అరకులోయలో ఆర్ ఐటీఐ నుంచి అంబేద్కర్ జంక్షన్ వరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీ స్థాయిలో నిర్వహించిన బైక్, ఆటో,కార్ల ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జంక్షన్ వద్ద నిర్వహించిన సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణి, అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగంను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని చేతులు జోడించి అడుగుతున్నామన్నారు. ఈ ఎన్నికలు పేదలకు పెత్తందారులకు మధ్య జరుతున్నవి అన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం జగన్‌మోహన్ రెడ్డి పేదల పక్షాన నిలబడి, అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పేదల జీవితాలు నిత్యం సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. అమ్మ ఒడి ప్రవేశపెట్టి ప్రతి విద్యార్థి తల్లి ఖాతాలో రూ. 15 వేలు జమ చేస్తున్నారన్నారు. డ్వాక్రా మహిళల రుణాలు మాఫీ చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. మహిళలు వారి కాళ్లపై నిలబడేందుకు చేయుత పథకం ద్వారా ఐదేళ్లలో రూ. 75 వేలు వారి ఖాతాల్లో జమ చేశారన్నారు. వికలాంగులు, వృద్ధులకు ప్రతినెలా ఒకటో తేదీన ఉదయం ఏడు గంటలకే పింఛను అందేలా చర్యలు చేపట్టారన్నారు. మెరుగైన వైద్యం అందించే చర్యల్లో భాగంగా పాడేరులో రూ.500 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్య కళాశాల జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించారన్నారు. అరకు పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల పరిధిలోని అన్ని ఆస్పత్రులు, పాఠశాలలు అత్యాధునికంగా తీర్చిదిద్దారన్నారు. పేదల వైద్యానికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షలకు పెంచారన్నారు. గ్రామాల్లోనే సేవలందించేందుకు సచివాలయ వ్యవస్థ, రైతుల కోసం ఆర్‌బీకేలు నిర్మించామన్నారు. 2014 ఎన్నికల్లో జతకట్టిన టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు అనేక సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు మోసం చేసిన చరిత్ర వారిదన్నారు. మళ్లీ ఈ ఎన్నికల్లో అదే పార్టీలు జతకట్టి మళ్లీ రాష్ట్ర ప్రజలకు మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వారికి అవకాశం ఇవ్వకూడదన్నారు. ప్రస్తుతం అందుతున్న సంక్షేమ పథకాలు రాబోయే రోజుల్లో కూడా అందాలంటే మళ్లీ జగనన్న సీఎంను చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మ తనూజరాణి మాట్లాడుతూ గిరిజన ప్రాంత అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారన్నారు. గతంలో కన్నా మరింత మెరుగైన పథకాలు ప్రవేశపెడుతూ మేనిఫెస్టోను ప్రకటించారన్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం మాట్లాడుతూ అసెంబ్లీ సీటు కేటాయించి ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని జగనన్న కల్పించారన్నారు. ప్రతిఒక్కరు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి తనూజారాణిని గెలిపిస్తే మీకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. ర్యాలీల్లో పార్టీ శ్రేణులు జై జగన్ నినాదాన్ని హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో పాడేరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లి పల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యే, అరకు అసెంబ్లీ పరిశీలకురాలు శోభ హైమావతి దేవి, మెడికల్ కౌన్సిల్ మెంబర్ నర్సింగరావు, ఆరు మండలాల ఎంపీపీలు, జెడ్పీటిసిలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

- ప్రచారం ముమ్మరం



హుకుంపేట మండలం కొంతిలో ప్రచారం చేస్తున్న అరకు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీఅభ్యర్థి రేగం మత్స్యలింగం



ధారకొండలో ప్రచారం చేస్తున్న పాడేరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వేశ్వరరాజు



రంపచోడవరంలో రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి

పోలింగ్ తేదీ గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ పాడేరు అసెంబ్లీ అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, అరకు అసెంబ్లీ అభ్యర్థి రేగం మత్స్యలింగం, రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి ప్రచారం ముమ్మరం చేశారు. పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో నేరుగా ప్రజలను కలిసి మేనిఫెస్టో కరపత్రాలను అందజేసి మద్దతు కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తమతో పాటు అరకు ఎంపీ అభ్యర్థి గుమ్మ తనూజారాణిని గెలిపించాలని కోరారు.

– సాక్షి,నెట్‌వర్క్

ఏకలవ్యలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతూరు: మండలంలోని లక్కవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీసీలో బాలురకు తొమ్మిది, బాలికలకు ఏడు, బైపీసీలో బాలురకు ఏడు, బాలికలకు రెండు, హెచ్ఈపీలో బాలికలకు ఏడు సీట్లు ఖాళీగా ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. 2024లో పదో తరగతి, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, వచ్చిన దరఖాస్తులను పరిశీలించి కౌన్సెలింగ్‌లో మెరిట్ ఆధారంగా అర్హులతో భర్తీ చేస్తామని ఆయన తెలిపారు. వివరాలకు ఏకలవ్య కళాశాలలో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ఓటుహక్కు వినియోగించుకున్న మాజీ మంత్రి దంపతులు



ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం మాజీమంత్రి బాలరాజు, రూపవతి దంపతులు

జి.మాడుగుల: వయోవృద్ధులకు ప్రభుత్వం కల్పించిన హోం ఓటింగ్‌ను ఆదివారం జి.మాడుగులలో ప్రభుత్వం కల్పించిన హోం ఓటింగ్‌ను మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు, భార్య రూపవతి వినియోగించుకున్నారు. ఈ విషయాన్ని పోలింగ్ అధికారి లోహిత్ జయసాగర్ తెలిపారు.

మర్రి కామయ్యకు ఘన నివాళి



కామయ్యపేటలోని మర్రి కామయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గిరిజనులు

హుకుంపేట: స్వాతంత్ర్య ఉద్యమ పోరాట యోధుడు మర్రి కామయ్య వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. మర్రి కామయ్య ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తీగలవలస పంచాయతీతో పాటు పలు గ్రామాల నుంచి గిరిజనులు వచ్చారు. ఈ సందర్భంగా గ్రామంలోని కామయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సర్పంచ్, ఎంపీటీసీలు పాంగి బేసు, కొర్ర నాగరాజుతో పాటు గ్రామ పెద్దలు మాట్లాడుతూ మర్రి కామయ్య చరిత్రను, స్వాతంత్ర్య పోరాటంలో చేసిన పనులను ప్రజలకు వివరించారు. మర్రి కామయ్య ఆశయసాధనకు అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు.

వైఎస్సార్‌సీపీ ప్రభంజనం తథ్యం



సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థి తనుజారాణి, పాడేరు ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వేశ్వరరాజు, పార్టీ పరిశీలకులు శ్రీకాంత్‌రాజు, వెంకటలక్ష్మి

పాడేరు: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ సునాయసంగా విజయం సాధిస్తుందని, వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరు ఆపలేరని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. ఆదివారం సాయంత్రం పాడేరు పట్టణంలోని తలారసింగి వద్ద వైఎస్సార్‌సీపీ అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ గుమ్మా తనుజారాణి, పాడేరు అసెంబ్లీ ఎమ్మెల్యే అభ్యర్థి మత్స్యరాస విశ్వేశ్వరరాజు, పార్టీ పాడేరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు కాకర్లపూడి శ్రీకాంత్‌రాజు, పీలా వెంకటలక్ష్మిలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని ఐదేళ్ల కాలంలో తమ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో న్యాయం చేసిందన్నారు. గడప వద్దకే పాలన, పథకాలు అందిస్తూ ప్రజల వ్యయప్రయాసాలు తగ్గించారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ పూర్తి స్థాయిలో అమలు చేసి ధైర్యంగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని, ఓటు హక్కు అడిగే నైతిక హక్కు ఒక్క వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందని భాగ్యలక్ష్మి స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజలకు మరి ముఖ్యంగా గిరిజన ప్రాంతానికి, ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎన్నికలను ధైర్యంగా ఎదుర్కొనేందుకు వైఎస్సార్‌సీపీ క్యాడర్ అంతా ఎంతో పటిష్టంగా పకడ్బందిగా పని చేస్తున్నారని చెప్పారు. ఏ గ్రామానికి ఎన్నికల ప్రచారానికి వెళ్లిన స్థానిక గిరిజనులు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. గిరిజనమంతా వైఎస్సార్‌సీపీ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తమర్భ నర్సింగరావు, యువజన విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెట్టి వినయ్, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగ్లన్నదొర, ఏఎంసీ చైర్మన్ సూరిబాబు, పంచాయతీరాజ్ విభాగ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, చింతపల్లి ఎంపీపీ అనుషాదేవి, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, మాజీ ఎంపీపీ వెంకట గంగరాజు, సీనియర్ నాయకురాలు కురుసా పార్వతమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాటు పడవ బోల్తా

- ఒడిశా వాసి మృతి
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



నదిలో నుంచి ఉద్ధవ్ మృతదేహాన్ని బయటికి తీస్తున్న ఓడ్రాఫ్ బృంద సభ్యులు

ముంచంగిపుట్టు : ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు జలాశయం దిగువ ప్రాంతంలో శనివారం నాటు పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో ఒడిశాకు చెందిన గిరిజనుడు మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఒడిశాలోని బంగురుపడా గ్రామానికి చెందిన ఉద్ధవ్ కోరా (35) శనివారం సాయంత్రం కుంబిపడా గ్రామంలో ఉన్న బంధువుల ఇంటికి నాటు పడవలో బయలుదేరాడు. ఈ ప్రయత్నంలో ప్రమాదవశాత్తు అతని పడవ బోల్తా పడింది. ఉద్ధవ్ కుంబిపడాకు రాలేదని బంధువులు తెలపడంతో రాత్రి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులు గెడ్డ ప్రాంతానికి వెళ్లి చూడగా నాటు పడవ నదిలో తేలుతూ కనిపించింది. దీంతో ప్రమాదం జరిగిందని భావించిన కుటుంబ సభ్యులు రాత్రి అయినా గాలించారు. అయితే ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాక గాలింపు నిలిపేశారు. ఆదివారం ఉదయం మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం అధికారులకు విషయం తెలిపారు. దీంతో స్పందించిన అధికారులు జోలాపుట్టు జలాశయం నుంచి డుడుమకు నీటి విడుదలను నిలుపుదల చేశారు. ఒడిశా లంతాపుట్టు నుంచి ఓడ్రాఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బందిని రప్పించి గాలించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఉద్ధవ్ మృతదేహం లభ్యం కావడంతో కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం జోలాపుట్టు జలాశయం నుంచి నీటి విడుదలను పునరుద్ధరించారు. నీటి విడుదల నిలిపివేయడం వల్ల విద్యుత్ ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగలేదని, ప్రస్తుతం రెండు జనరేటర్లతో 44 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని మాచ్‌ఖండ్ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్సీ అనంత బాబు

- టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నేతలకు కండువాలు కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్సీ అనంతబాబు

మారేడుమిల్లి : మండలంలోని టీడీపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీల నేతలు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో భారీగా చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు డాక్టర్ పి.హరికృష్ణ, ఆ పార్టీ మాజీ అధ్యక్షుడు నల్లమిల్లి రామారెడ్డి, టీడీపీ సీనియర్ నేత గురుకు వెంకటేశ్వరరావు, ఆ పార్టీకి చెందిన వార్డు మెంబర్లు బోరగా విజయలక్ష్మి, నల్లమిల్లి సూబ్బారెడ్డి, మాజీ వార్డు మెంబర్ దయామణి, నాయకులు లక్కొండ లాభాన్, పల్లాల విజయ, లక్కొండ పరమయ్య, మైనారిటీ సెల్ నాని, జనసేనకు చెందిన గడే ధర్మతేజ, మల్లెల హరిబాబు తదితరులు సుమారు వంద మందితో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్సీ అనంతబాబు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, వైస్ ఎంపీపీ లక్కొండ రవికుమార్, కోఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, జేసీఎస్ మండల కన్వీనర్ గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), ఉపసర్పంచ్ వీరబాబు, ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్, విక్టర్ బన్ను, కే. సురేష్, బి.సురేష్, సతీష్, అనిదీప్ కుమార్ పాల్గొన్నారు.

పోలీసు యంత్రాంగం అప్రమత్తం

- ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా బందోబస్తు
- రంగంలోకి 26 కేంద్ర పోలీసు బలగాల బృందాలు
- ముమ్మరంగా కూంబింగ్, తనిఖీలు

సాక్షి,పాడేరు: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలలో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది.మావోయిస్టు ప్రభావిత జిల్లా కావడంతో పాటు సరిహద్దులోని ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోను మావోయిస్టుల ప్రాబల్యం అధికంగా ఉండడంతో భారత ఎన్నికల సంఘం జిల్లాలో ఎన్నికలపై మరింత దృష్టి కేంద్రీకరించింది.జిల్లాలో ఎన్నికలకు భారీగా కేంద్ర పోలీసు బలగాలను రంగంలోకి దింపింది. 26 సీఆర్‌పీఎఫ్ బలగాలను జిల్లాకు రప్పించారు. ప్రస్తుతం జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లతో పాటు అవుట్ పోస్టులలోను సీఆర్‌పీఎఫ్ బలగాలు మోహరించాయి. వీటికి అదనంగా దేశంలోని పలు ప్రాంతాల బెటాలియన్‌లకు చెందిన సీఆర్‌పీఎఫ్ బలగాలు భద్రత చర్యల్లో నిమగ్నమయ్యారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ ముమ్మరం చేశారు.

అవుట్ పోస్టుల పరిధిలో రెడ్ అలర్ట్

మావోయిస్టుల సంచారంపై కేంద్ర నిఘా వర్గాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలోని అన్ని పోలీసు అవుట్ పోస్టుల పరిధిలో పోలీసు శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించింది.అలాగే సరిహద్దు ఒడిశా,ఛత్తీస్‌గడ్ రాష్ట్రాల అవుట్ పోస్టుల పరిధిలోను బీఎస్‌ఎఫ్, సీఆర్‌పీఎఫ్ బలగాలు మావోయిస్టుల కార్యకలపా లు నిరోధం లక్ష్యంగా గాలింపు చర్యలను విస్తృతం చేశాయి.జిల్లాలోని పోలీసు అధికారులతో ఆయా రాష్ట్రాల పోలీసు అధికారులు రోజువారి సమీక్షలు నిర్వహిస్తున్నారు. దండకారణ్యమంతా పోలీసు బలగాలు జల్లెడపడుతున్నాయి. అదనంగా గ్రేహౌండ్స్, ఏపీఎస్పీ బలగాలు రాష్ట్ర పరిధిలోని గ్రేహౌండ్స్, ఏపీఎస్పీ పోలీసు బలగాలు కూడా అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో అందుబాటులో ఉన్నాయి. ఇటీవల పాడేరు, అరకులోయ, చింతూరు, రంపచోడవరం ప్రాంతాల్లో పోలీసు బలగాలతో కవాతులు నిర్వహించారు. ప్రశాంతంగా నిర్వహించనున్న ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరుతూ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కట్టుదిట్టంగా భద్రత



జిల్లాలో సార్వత్రిక ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించే లక్ష్యంతో పోలీసుశాఖ పనిచేస్తుంది. కేంద్ర పోలీసు బలగాలను పెద్ద సంఖ్యలో అందుబాటులో ఉంచాం. అన్ని పోలింగ్ కేంద్రాల్లో భద్రత చర్యలను కట్టుదిట్టం చేశాం. మరోవైపు పోలీసు బలగాలలో గాలింపు చర్యలను విస్తృతం చేశాం.ఒడిశా పోలీసు యంత్రాంగం కూడా సహకరిస్తుంది.

– తుహిన్ సిన్హా, జిల్లా ఎస్పీ

ముమ్మరంగా తనిఖీలు



దాసరిపుట్టు చెక్ పోస్ట్ వద్ద తనిఖీలు చేస్తున్న సీఐ రమేష్, పోలీసులు

ముంచంగిపుట్టు: సాధారణ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్ వద్ద ఆంధ్ర–ఒడిశా సరిహద్దు రాష్ట్రాల వాహన రాకపోకలపై కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేసినట్టు జి.మాడుగుల సీఐ రమేష్ అన్నారు. ముంచంగిపుట్టు నుంచి పెదబయలు వెళ్లే ప్రధాన మార్గంలో దాసరిపుట్టు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌ను ఆదివారం సీఐ రమేష్ పరిశీలించి, వాహనాల తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగులు, లగేజీలు క్షుణ్ణంగా పరిశీలించారు. అపరిచితులు, అనుమానితుల వివరాలను సైతం సేకరించారు. ఈ సందర్భంగా సీఐ రమేష్ మాట్లాడుతూ నగదు, మద్యం, విలువైన వస్తువుల అక్రమ రవాణాపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఎక్కడైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎటువంటి సమస్యలు సృష్టించకుండా అందరూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని, ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన కోరారు. తనిఖీల్లో ఎస్ఐ రవీంద్ర, రెవెన్యూ ఆర్ఐ భూపతిపడాల్, సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఏజెన్సీ అభివృద్ధి



రంపచోడవరంలో ఎమ్మెల్యే ధనలక్ష్మి ఎన్నికల ప్రచారం



ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

రంపచోడవరం: ప్రజలు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి తీసుకువచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చూసేందుకు ఎదురు చూస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి నాగుపల్లి ధనలక్ష్మి అన్నారు. రంపచోడవరంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. పందిరిమామిడి సెంటర్ నుంచి కార్యకర్తలు, నాయకులు, అభిమానులతో పాత ఆంధ్రా బ్యాంకు మీదుగా ఎర్రంరెడ్డి నగర్, జూనియర్ కళాశాల సెంటర్, అంబేడ్కర్ సెంటర్, దేవీగుడి సెంటర్ మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అక్కడ నుంచి రంప రోడ్డు మీదుగా ర్యాలీ ముగిసింది. ఎన్నికల ప్రచారంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ఏజెన్సీ రూపురేఖలు మార్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేన్నారు. నాడు–నేడు, కొత్త పీహెచ్‌సీలు ఏర్పాటు, ప్రతీ ఇంటికి కుళాయిలు, రోడ్డులు నిర్మాణం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగాయన్నారు. టీడీపీ చంద్రబాబునాయుడు అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కూటమితో సిద్ధమవుతున్నాడని, ప్రజలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. 2019 ఎన్నికల్లో చంద్రబాబు మోసానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి అరకు ఎంపీ అభ్యర్థి డాక్టర్ తనూజారాణి, ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపించాలని కోరారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జడ్పిటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు కాపారపు రూతూ, అన్నవరం డైరెక్టర్ కారుకోడి పూజ, సర్పంచ్‌లు మంగా బొజ్జయ్య, వడగల ప్రసాద్, కోసు రమేష్‌బాబుదొర, పార్టీ కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, పండా రామకృష్ణదొర, మంగా తమ్మన్నకుమార్ తదితరలు పాల్గొన్నారు.

పాడేరు ఘాట్‌లో ప్రమాదం

- ఒకరు మృతి.. ఇద్దరికి గాయాలు
- మృతుడు వైఎస్సార్‌సీపీ గృహసారథి
- కేసు నమోదు చేసిన పోలీసులు



ఘటన స్థలంలోనే మృతి చెందిన సింహాచలం



ప్రమాదం జరిగిన దృశ్యం

పాడేరు : పాడేరు–చోడవరం ప్రధాన రహదారి డైమండ్ పార్క్ ఘాట్‌లో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ప్రైవేటు సర్వీసు జీపు ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చోడవరం నుండి ప్రయాణికులతో పాడేరు వస్తున్న జీపు పాడేరు నుండి మైదాన ప్రాంతం వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో పాడేరు మండలం తుంపాడ పంచాయతీ గెడ్డంపుట్టు గ్రామానికి చెందిన ముడవ సింహాచలం అనే వ్యక్తి తలకు తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మృతి చెందిన వ్యక్తితో పాటు ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న గెడ్డంపుట్టు గ్రామానికి చెందిన వెంకట్‌తేజ్, జీవన్ అనే మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన జీపు డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పాడేరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. కాగా మృతి చెందిన ముడవ సింహాచలం వైఎస్సార్‌సీపీలో గృహసారథిగా పని చేస్తున్నారు. కొన్ని రోజులుగా పార్టీ అభ్యర్థుల విజయం కోసం మండల పార్టీ క్యాడర్‌తో కలిసి విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం వ్యక్తిగత పనులు న్నాయని ఎన్నికల ప్రచారానికి వెళ్లలేదు. ద్విచక్ర వాహనంపై వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందటం కటుంబ సభ్యులను, వైఎస్సార్‌సీపీ నాయకులను తీవ్రంగా కలిచివేసింది. ఆయన మృతి పట్ల పార్టీ మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

కొనసాగుతున్న అధిక ఉష్ణోగ్రతలు

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి.ఉదయం 10గంటల నుంచే ఎండ విజృంభిస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 37.9 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 37డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు ఆదివారం నమోదయ్యాయి.

'నీట్'గా పరీక్ష



విశాఖ విద్య: దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అండర్ గ్రాడ్యుయేషన్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నేషనల్ ఎలిజిబుల్ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి ముందుగానే చేరుకున్నారు. విద్యార్థులను తనిఖీలు చేసిన తర్వాతే కేంద్రాల్లోకి పంపించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సదుపాయం కల్పించారు. ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

8 నుంచి 13 వరకు అప్పన్న ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు భగవత్ రామానుజాచార్యుల తిరునక్షత్రం పూజలను విశేషంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

ఈ నెల 8, 11, 12 తేదీల్లో రాత్రి 7గంటల వరకే స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు. అలాగే, శ్రీవైష్ణవ శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ నెల 13న సాయంత్రం 5గంటలకు హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి జరుగుతుందని తెలియజేశారు.

సంబల్‌పూర్–కాచిగూడ మధ్య స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: దువ్వాడ మీదుగా సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సంబల్‌పూర్–కాచిగూడ(08323) స్పెషల్ సంబల్‌పూర్‌లో ప్రతి సోమవారం రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.20కు దువ్వాడ, రాత్రి 9.50కు కాచిగూడ చేరుకుంటుంది. కాచిగూడ–సంబల్ పూర్(08324) రైలు కాచిగూడలో ప్రతి మంగళవారం రాత్రి 11.20కు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.30కు దువ్వాడ, రాత్రి 11.45కు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

పేదల జీవితాలకు భరోసా



గొళ్లగట్టలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంతబాబు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ అనంతబాబు

ఎమ్మెల్సీ అనంతబాబు

ఎటపాక: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీతోనే పేదలకు భరోసా సాధ్యమని.. మానవత్వంలేని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలను ఓటుతోనే తరిమికొట్టాలని ఎమ్మెల్సీ అనంత బాబు పిలుపునిచ్చారు.ఆదివారం మండలంలోని గొళ్లగట్ట, మంగువాయి, వెంకటరెడ్డిపేట, చోడవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన జగనన్న ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేదల సంక్షేమానికి ప్రకటించిన ప్రతీ హామీ అమలు చేస్తారని అన్నారు. అమలు సాధ్యం కాని హామీలతో టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు మరోసారి మోసం చేయాలని చూస్తున్నారని వారికి ఓటుతోనే తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ అభ్యర్థి తనూజారాణిని గెలిపించాలని కోరారు. విస్సాపురం, గుండాల ,పురుషోత్తపట్నం, గొళ్లగట్ట తదితర గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన వంద కుటుంబాలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. జెడ్పీటీసీ ఉబ్బా సుస్మిత,ఎంపీపీ కాక కామేశ్వరి, ఎంపీటీసీలు వెంకటరామిరెడ్డి, వెంకటరమణ, సర్పంచ్‌లు ఆదినారాయణ, గుండి సీతాలక్ష్మి, అలివేలు,మణి, ఉపసర్పంచ్ శశికుమార్, సచివాలయాల మండల కన్వీనర్ గోసు ప్రశాంత్, పార్టీ మండల కన్వీనర్ తానికొండ వాసు,ఉపాధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మంత్రిప్రగడ నర్సింహరావు,జిల్లా కార్యదర్శి దామెర్ల రేవతి, కొవ్వూరి రాంబాబు,రంబాల నాగేశ్వరరావు,కృష్ణబాబు,శంకర్,సత్యనారాయణ,ఎలమోలు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం నియోజకవర్గం ప్రగతి పథంలో పరుగులు తీస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచీ జరగని అభివృద్ధి ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలోనే కనిపిస్తోంది. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉండిపోయిన అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. ఇదే ప్రాంతంలో పదేళ్ల పాటు పని చేసిన టీడీపీ ఎమ్మెల్యే గుక్కెడు తాగునీరు ఇచ్చిన పాపాన పోలేదు.

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే సమగ్రాభివృద్ధి
- 60 ఏళ్లుగా కానరాని ప్రగతి ఐదేళ్లలోనే..
- దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం


రూ.82 కోట్లతో నిర్మించిన బంగారుమెట్ట-కశింకోట రోడ్డు

చోడవరం... అభివృద్ధి పరం

చోడవరం: నాలుగున్నరేళ్లలో నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం మండలాల్లో ఇటు సంక్షేమం, అటు అభివృద్ధి పనులు అనేకం చేపట్టారు. రూ.1,800 కోట్లతో సంక్షేమ, అభివృద్ధి పనులు జరిగాయి. ఇంత భారీ మొత్తంలో ఏ ప్రభుత్వ హయాంలోనూ కాలేదు. రూ. 850 కోట్ల అభివృద్ధి పనులు చేయగా, మరో రూ. 850 కోట్లు వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వం నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి వేసింది. కార్యాలయాల చుట్టూ తిరగకుండా ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం, ప్రభుత్వ పథకాలు పొందడం కోసం సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలనను గ్రామస్థాయికి తెచ్చింది. నియోజకవర్గంలో 1,445 మంది వలంటీర్లను నియమించి నేరుగా ప్రభుత్వ పథకాలన్నీ ప్రజల ఇంటికే చేరుస్తోంది. రైతు భరోసా కేంద్రాలు నిర్మించి విత్తనాలు, ఎరువులు, కిమిసంహారక మందులు గ్రామాల్లోనే అందిస్తున్నారు. పంట సీజన్లలో నేరుగా రైతుల వద్దకే శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు వచ్చి వ్యవసాయ సూచనలు ఇస్తున్నారు. విద్యుత్ లైన్ వేయలేని 42 మైదాన గిరిజన గ్రామాలకు సోలార్ సిస్టమ్స్ సాయంతో మంచినీటి సౌకర్యం కల్పించిన ఏకైక ప్రభుత్వం. 20 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని ప్రధాన రహదారులన్నీ కోట్లాది రూపాయలతో కొత్త రోడ్లను వేసి ప్రజల కష్టాలను తీర్చారు. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజలకు ధీమా కలిగించడంపై సర్వత్రా ఆనందం వ్యక్తమవుతోంది.


చోడవరంలో రూ.18 కోట్లతో నిర్మించిన మినీ మంచినీటి రిజర్వాయరు

ఐదేళ్ల పాలనలో ఎంతో చేశాం



గత టీడీపీ హయాంలో కేంద్రం నుంచి వచ్చిన ఎన్‌ఆర్జీఈఎస్ సీసీ రోడ్లు తప్పా ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచీ నాలుగున్నరేళ్లలో అభివృద్ధి, సంక్షేమంలో చాలా ఎక్కువగా చేశాం. నియోజకవర్గంలో అన్ని రోడ్లను కొత్తగా వేయించాం. ప్రతీ గ్రామంలో సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్లు కట్టించి ప్రభుత్వ సేవలందేలా చేసింది. గిరిజన తండాలకు మంచినీరు అందించాం. ఆస్పత్రులు అభివృద్ధి చేశాం. రూ.1,800 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిన ఏకైక ప్రభుత్వం మాదే. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పనులు చేపడతాం.

– కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్, చోడవరం

పదేళ్లలో టీడీపీ ఎమ్మెల్యే చేసింది శూన్యం

పదేళ్లపాటు టీడీపీ ఎమ్మెల్యేగా పనిచేసిన కె.ఎస్.ఎన్.ఎస్. రాజు చోడవరం నియోజకవర్గంలో ప్రధాన సమస్యల్లో ఏ ఒక్కటీ పరిష్కరించలేదు. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో మంజూరైన సీసీరోడ్లు మినహా ఒక్క సమస్యను పరిష్కరించలేకపోయారు. 2009 నుంచి 2019 వరకూ ఆయన ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నారు. 2014–19 వరకూ టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. తన సొంత ప్రభుత్వ హయాంలోనూ ఒక్క లింకురోడ్డు నిర్మించలేదు. ప్రధానమైన రాజాం రోడ్డు, గవరవరం, బెన్నవోలు, తోటకూరపాలెం, ఆర్లె, బంగారుమెట్ట రోడ్డు, కుసర్లపూడి, గౌరీపట్నం, జుత్తాడ, భోగాపురం, లక్ష్మీపురం రోడ్లతోపాటు అనేక గ్రామాలను అనుసంధానం చేసే బీటీరోడ్లు పెద్ద పెద్దగోతులు ఏర్పడి ప్రమాదాలకు నిలయమై ఎంతోమంది చనిపోయారు. తాగునీటి ఎద్దడితో జనం అల్లాడుతున్నా ఒక్క గ్రామానికి పూర్తిస్థాయిలో సమస్య పరిష్కరించలేదు. భారత్‌మాల పథకంలో బీఎన్‌రోడ్డును మంజూరు చేస్తామని, అది ప్రతిపాదనలకే పరిమితం చేశారు. చోడవరం పట్టణంలో గుక్కెడు తాగునీరు ఇవ్వలేకపోయారు. టీడీపీ కార్యకర్తల ఇసుక తవ్వకాల పుణ్యమా అని కూలిపోయిన బొడ్డేరు, గవరవరం వంతెనలు పూర్తి చేయలేకపోయారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీని అభివృద్ధి చేస్తామని చెప్పి టీడీపీ పాలకవర్గం రూ. 150 కోట్లు అప్పుల ఊబిలోకి నెట్టి వారు మాత్రం కోట్లు సంపాదించుకున్నారు. ఒక్క సాగునీటి ప్రాజెక్టును అభివృద్ధి చేయలేదు. యువతకు ఉపాధి కల్పించే ఒక్క పరిశ్రమ నెలకొల్పలేకపోయారు. అసలు ఆయన ఎమ్మెల్యేగా పదేళ్లలో ఏ ఒక్కా ప్రధాన సమస్యను పరిష్కరించలేకపోయారు.



నెరవేరిన సొంతింటి కల

- నియోజకవర్గంలో జగనన్న కాలనీలు : 96 లేఅవుట్లు
- ఇళ్లులేని వారికి ఇచ్చిన ఇంటి పట్టాలు: 4,547
- జగనన్న కాలనీల్లో మంజూరైన ఇళ్లు: 4,720
- ఇంటి స్థలం ఉండి పక్కాగృహం మంజూరైన లబ్ధిదారులు: 4,297
- మొత్తం ఇళ్లకు ప్రభుత్వం మంజూరు చేసింది: రూ. 162 కోట్లు
- ఇప్పటి వరకూ ఇళ్లు కట్టుకున్న వారికి చెల్లించినది: రూ. 87 కోట్లు
- జగనన్న కాలనీల్లో విద్యుత్, రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించారు.

ఇంటింటికీ మంచినీటి కుళాయిలు

- మొత్తం ప్రాజెక్టు విలువ: రూ. 156 కోట్లు
- నియోజకవర్గంలో మొత్తం పంచాయతీలు: 117
- శివారు గ్రామాలతో కలిపి గ్రామాలు: 154
- కుళాయి కనెక్షన్లు ఇంచిన ఇళ్లు : 58వేల 600
- కొత్తగా నిర్మించిన మంచినీటి ట్యాంక్‌లు : 80
- మొత్తం పనులు -800 • నీటి పంపింగ్ బోర్లు -120
- పైపులైన్ విస్తీర్ణం: 500 కిలోమీటర్లు
- తాగునీరు కల్పించిన మైదాన గిరిజన పంచాయతీలు: 15
- గిరిజన తండాల్లో నీటి పంపింగ్ కోసం సోలార్ యూనిట్లు: 42
- జగనన్న కాలనీల్లో : రూ.14 కోట్లతో మంచినీటి సౌకర్యం
- చోడవరం పట్టణం తాగునీటికి మినీ రిజర్వాయరు: రూ. 18.5 కోట్లు

నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లోనూ లింక్‌రోడ్ల నిర్మాణం

ప్రధానంగా గత ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మిగిలిపోయిన అనేక రోడ్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మించారు. వీటికోసం రూ. 250 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో ఇప్పటికే రూ. 82 కోట్లతో బంగారుమెట్ట– కశింకోట రోడ్డు, రూ. 48 కోట్లతో చేపట్టిన చోడవరం – సింహాద్రిపురం, చోడవరం – లక్ష్మీపురం, గోవాడ–భోగాపురం, చోడవరం–గవరవరం, బీఎన్‌రోడ్డు నుంచి వయా గౌరీపట్నం వడ్డాది కస్బా రోడ్డు, తట్టబంద – రాజాం రోడ్డు, బుచ్చెంపేట రోడ్డు, తోటకూరపాలెం – రావికమతం రోడ్డు, రావికమతం – చలిసింగ రోడ్డు, చినపాచిలి రోడ్డు, గుర్రాలపాలెం రోడ్లు మేడివాడ – కానాడ రోడ్డు, మేడివాడ – బాదంపాడు రోడ్డు, రోలుగుంట – శరభవరం, కె.నాయుడుపాలెం వయా నిండుగొండ, బుచ్చెంపేట రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. కొత్తగా మరో రూ.20.5 కోట్లతో రాజుపాలెం రోడ్డు, సీతయ్యపేట వయా పంగిడి రోడ్డు, ఐతంపూడి రోడ్డు, గుడివాడ రోడ్డు, గొల్లలపాలెం రోడ్డు, గౌన్నవానిపాలెం రోడ్డు, రావికమతం–మరుపాక రోడ్డు పనులు జరుగుతున్నాయి.



నాడు - నేడు స్కూళ్లు

- అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలతో కార్పొరేటు స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారు. తరగతి గదుల్లో బెంచీలు, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేశారు.
- ఎంపికైన మొత్తం స్కూళ్లు–181
- వ్యయం–రూ. 48 కోట్ల 18లక్షలు
- ఆధునికీకరణ, అదనపు తరగతి గదులు నిర్మాణానికి వినియోగం అదనపు తరగతి గదుల నిర్మాణం–148
- విద్యార్థుల సంఖ్య–22,120 మంది

అభివృద్ధి చెందిన కాలేజీలు

- జన్నవరంలో జ్యోతీబాపూలే హాస్టల్ భనవ నిర్మాణానికి : రూ. 85 కోట్లు
- పాలిటెక్నికల్ కాలేజీ నిర్మాణానికి: రూ. 9.45 కోట్లు
- ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలకు : రూ. 5 కోట్లు
- చోడవరం గవర్నమెంటు డిగ్రీ కాలేజీ పీజీ కాలేజీగా అప్‌గ్రేడ్

	గ్రామ సచివాలయాలు	హెల్త్ సెంటర్లు (విలేజ్ క్లినిక్‌లు)	రైతు భరోసా కేంద్రాలు
మొత్తం భవనాలు	84	78	87
నిర్మాణ వ్యయం	రూ.92.10 కోట్లు	రూ.12.7 కోట్లు	రూ.18.97 కోట్లు
పూర్తి అయినవి	68	28	86
నిర్మాణంలో ఉన్నవి	21	44	1
సిబ్బంది	648	146	69
వలంటీర్లు	1,445	-	-
ఆశ కార్యకర్తలు	-	185 మంది	-


నియోజకవర్గంలో ప్రజలందరికీ సంక్షేమ పథకాలు ఇలా

పథకం పేరు	మొత్తం లబ్ధిదారులు	పంపిణీ నగదు(లక్షల్లో)
రైతు భరోసా	51,724	298.74
అమ్మ ఒడి	99,068	11,552.21
వైఎస్సార్ చేయూత	20,599	10,818.00
వైఎస్సార్ ఆసరా	61,408	1,2542.98
వైఎస్సార్ పింఛన్	46,248	1,261.86 కోట్లు
కాపు నేస్తం	7,978	1196.70
వాహనమిత్ర	8,540	854.00
వైఎస్సార్ ఆరోగ్యశ్రీ	21,712	4,494.17
సున్నావడ్డీ	67,914	2,048.00
వైఎస్సార్ చేదోడు	8,294	628.00

ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి, నూతన భవనాల నిర్మాణం

- ఆధునికీకరించిన ఆస్పత్రులు -8
- తురకలపూడి పీహెచ్‌సీకి కొత్త భవనం ఆధునికీకరణ: రూ.కోటి
- రావికమతం పీహెచ్‌సీ ఆధునికీకరణ : రూ.90 లక్షలు
- చోడవరం సీహెచ్‌సీ ఆధునికీకరణ : రూ. 1.10 కోట్లు
- ఆపరేషన్ థియేటర్, ఐక్యూబ్ సెంటర్, స్కానింగ్ మిషన్, ఇతర మౌలిక సదుపాయాలు





గోవాడ సుగర్స్ ఫ్యాక్టరీని ఆదుకున్న ప్రభుత్వం

టీడీపీ హయాంలో ఫ్యాక్టరీ అప్పులు : రూ.140 కోట్లు
వైఎస్సార్‌సీపీ వచ్చాక గ్రాంట్‌గా ఇచ్చి తీర్చిన అప్పు : రూ. 40 కోట్లు
రుణంగా ఫ్యాక్టరీకి ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ రూ. 85 కోట్లు
డిస్టిలరీ యూనిట్ ఏర్పాటుకు : రూ.100 కోట్లుతో ప్రతిపాదన
చెరకు బకాయిలు రైతులకు చెల్లింపునకు, కార్మికు జీత భత్యాల కోసం ప్రభుత్వం ఇచ్చిన గ్రాంటు : రూ. 12.40 కోట్లు

మహిళలే మహరాణులు

- ఎమ్మెల్యేగా ప్రజల ఆదరణ చూరగొన్న మాడుగుల ఆఖరి మహారాణి రమాకుమారి దేవ్
- ప్రజా సేవకు సిద్ధమంటున్న ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనూరాధ


చిట్టచివరి మహారాణి రమాకుమారిదేవ్ (ఫైల్)

మాడుగుల : మాడుగుల మహారాజుల పాలన కాలంలో ఈ ప్రాంతం సుభిక్షంగా తులతూగుతూ ఉండేదని, దేశ విదేశాల నుంచి వచ్చే ప్రముఖులతో నిత్యం కళకళలాడేదని చరిత్రకారులు చెబుతున్నారు. యుద్ధ వీరులను తయారు చేయడానికి ఏడు సావిడిలు, గుర్రాలకు తర్ఫీదు ఇచ్చేందుకు ప్రత్యేక శిక్షణ శాలలు ఉండేవని స్థానికంగా వయసు మళ్లిన వారు ఇప్పటికీ చెబుతుంటారు. అయితే రాజుల కాలం ముగిసిపోయిన తర్వాత ఇక్కడి కోటలో నాటి రాజ వంశస్తులు ఎవరూ నివాసం ఉండకపోవడంతో కోట శిథిలమైపోయింది. జమిందారీ వ్యవస్థ రద్దయే ముందు ఒక ఏడాది రమాకుమారి దేవ్, భర్త రామకృష్ణదేవ్ ఈ సంస్థానం చిట్టచివరి రాజవంశీకులుగా పాలన సాగించారు. రమాకుమారి దేవ్ చిట్టచివరి మహారాణిగా ఇక్కడి వారు చెబుతుంటారు. జమిందారీ వ్యవస్థ రద్దు కావడంతో రమాకుమారి దేవ్ మాడుగుల కోటలో నివాసం ఉంటూ ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చారు. ఆమె 1967 నుండి 1972 వరకు కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాజుల కాలాన్ని గుర్తు చేస్తూ పరిపాలన సాగించి ప్రజల మన్ననలు పొందినట్లు ఇక్కడి వారు చెబుతుంటారు. అలాగే మాడుగులలో బొడ్డు కళావతి కూడా ఎమ్మెల్యేగా సేవలందించారు. ఇక ప్రస్తుత కాలానికి వస్తే వైఎస్సార్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు కుమార్తె ఈర్లె అనూరాధ బరిలో ఉన్నారు. తండ్రి బూడి సేవాగుణాన్ని పుణికిపుచ్చుకున్న అనూరాధ పేదల సేవలో అలుపూసొలుపు లేకుండా శ్రమిస్తూనే ఉన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా సాయం అర్థించిన వారిని ఆదుకుంటూ నాటి దయార్థ హృదయులైన రాణులకు తానేమీ తీసిపోనని మాడుగుల ప్రజలచే మన్ననలు అందుకుంటున్నారు.

చరిత్రకు సాక్ష్యం

ఒక పక్క గోదావరి అందాలు.. మరోపక్క అభయారణ్యం.. ప్రకృతి సోయగాలు.. ఇలా ఎన్నో ప్రత్యేకతలకు నిలయం రంపచోడవరం. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో ఉండే ఈ నియోజకవర్గాన్ని జిల్లాల పునర్విభజనలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో చేర్చారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన నేలగా ఈ ప్రాంతానికి చరిత్ర ప్రాధాన్యం ఉంది. రాజకీయంగా గత రెండు దఫాలు జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే విజయ సాధించారు. ఈ దఫా కూడా అదే పార్టీ తరఫున పోటీ చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి పోటీ చేస్తున్నారు. గోదావరి వరదల సమయంలో సహాయక చర్యలు చేపట్టడంతో పాటు నిత్యం ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించడం వల్ల ఆమెకే విజయావకాశాలు కనిపిస్తున్నాయి.


రంపచోడవరం పట్టణం

రంపచోడవరం ముఖచిత్రం

- బ్రిటిష్ పాలనలో పన్నులకు వ్యతిరేకంగా రంప పితూరి పేరిట పోరాటం
- అల్లూరి పోరాటానికి ఆనవాళ్లుగా రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి పోలీసుస్టేషన్లు
- పర్యాటకంగా దినదినాభివృద్ధి
- గిరిజనాభివృద్ధిలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలు కీలకపాత్ర
- రాష్ట్రంలో అతి పెద్దదిగా పొల్లూరు జల విద్యుత్ ప్రాజెక్ట్‌కు గుర్తింపు
- గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీ వెంటే గిరిజనం
- రెండు దఫాల సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులే భారీ మెజారిటీతో విజయం
- ఈ దఫా ఆపార్టీకే పట్టం కట్టే అవకాశం


రంపచోడవరం: జిల్లాలో విస్తీర్ణంలో అతిపెద్ద నియోజకవర్గంగా రంపచోడవరం గుర్తింపు పొందింది. ఏడు మండలాలు ఉన్న ఈ నియోజకవర్గంలో రాష్ట్ర విభజన సమయంలో ఖమ్మం జిల్లా పరిధిలోని చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్ పురం మండలాలను విలీనం చేశారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో రంపచోడవరం నియోజకవర్గాన్ని చేర్చిన తరువాత పర్యాటకంగా దినదినాభివృద్ధి చెందుతోంది. రంపచోడవరం, చింతూరు ఐటీడీఏలు ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. రాష్ట్రంలోని మేజర్ జలవిద్యుత్ ప్రాజెక్టులు నియోజకవర్గ పరిధిలోని మోతుగూడెం, డొంకరాయిలో ఉన్నాయి.

- మద్దుపీటి రాజు వంశానికి చెందిన ఇమ్మిడి దేవ చోడుడు పాలనలో ఈ ప్రాంతానికి చోడవరం పేరు వచ్చిందని చెబుతుంటారు. బ్రిటిష్ వారి పాలనలో పన్నులకు వ్యతిరేకంగా రంప పితూరి పేరిట పోరాటం జరిగింది. అప్పటినుంచి కాలక్రమంలో రంపచోడవరంగా పేరు మారింది. తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా గిరిజనుల్లో చైతన్యం నింపిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతంగా మన్యం ప్రాంతం చరిత్రలో నిలిచిపోయింది. బ్రిటిష్ వారి పాలనలో అల్లూరి దాడి చేసిన పోలీస్‌స్టేషన్ల భవనాలు రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగిలో నేటికి సాక్ష్యాలుగా ఉన్నాయి. బ్రిటీష్ వారి కాలం నుంచి మండల వ్యవస్థ వచ్చే వరకు రంపచోడవరం తాలూకాగా ఉండేది.


గిరిజనాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం


నాగులపల్లి ధనలక్ష్మి (వైఎస్సార్‌సీపీ అభ్యర్థి)


మిరియాల శిరీషాదేవి (టీడీపీ అభ్యర్థి)


రాష్ట్రంలో అతిపెద్దదైన పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం

మొత్తం ఓటర్లు:	2,77,317
పురుషులు:	1,31,901
మహిళలు:	1,45,400
ఇతరులు:	16
పోలింగ్ కేంద్రాలు:	399
సమస్యాత్మకం:	200


అభివృద్ధి చెందిన పర్యాటక ప్రాంతం గుడిసె హిల్స్

ప్రత్యేకతలివీ..

- రంపచోడవరం నియోజకవర్గానికి మూడు రాష్ట్రాల సరిహద్దులు ఉన్నాయి.
- రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా ఈ ప్రాంతంలో ఉన్న పాపికొండలు అందాలను తిలకించేందుకు పర్యాటకులు భారీగా వస్తుంటారు.
- బొంగు చికెన్ వంటకం తయారీ ఆద్యుడు ఈ ప్రాంత గిరిజనుడు కావడం విశేషం.
- ఏజెన్సీ భూభాగంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం జరుగుతోంది.
- ప్రసిద్ధి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం గండి పోశమ్మ ఆలయం గోదావరిని ఆనుకుని ఈ ప్రాంతంలో ఉంది.
- మారేడుమిల్లి ప్రాంతం సముద్రమట్టానికి ఎత్తుగా ఉండడంతో మారేడుమిల్లి, వై రామవరం అప్పర్ పార్ట్‌లో వాతావరణం నిత్యం చల్లగా ఉంటుంది. మారేడుమిల్లి ప్రాంతాన్ని ఆంధ్రా ఊటీగా పిలుస్తారు. గుడిసె హిల్ స్టేషన్ మారేడుమిల్లికి 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.
- రాష్ట్రంలో అతిపెద్దదైన పొల్లూరు జలవిద్యుత్ కేంద్రం మోతుగూడెంలో ఉంది. ప్రస్తుతం 460 మెగావాట్ల సామర్థ్యం గల నాలుగు యూనిట్ల ద్వారా ఉత్పత్తి అవుతోంది. ఒకొక్కటి 115 మెగావాట్ల సామర్థ్యంతో రూ.543 కోట్లతో మరో రెండు యూనిట్లు నిర్మాణ దశలో ఉన్నాయి.
- భూపతిపాలెం, ముసురుమిల్లి, సూరంపాలెం, మద్దిగెడ్డ ప్రాజెక్టుల ద్వారా సుమారు 45 వేల ఎకరాలకు సాగవుతున్నాయి.

రాజకీయ పోరు

రంపచోడవరం నియోజకవర్గం గతంలో కాంగ్రెస్, టీడీపీలకు కుంచుకోటగా ఉండేది. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం తరువాత రెండు దఫాలు జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధించారు. 1962లో ఎల్లవరం నియోజకవర్గం ఏర్పడింది. కాంగ్రెస్ నుంచి 1962 నుంచి 1972 వరకు రెండు పర్యాయాలు చోడి మల్లికార్జునరావు, 1972 నుంచి 77 వరకు తడపట్ల రత్నాబాయి విజయం సాధించారు. 1977 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గొర్లె ప్రకాశరావు గెలుపొందారు. 1983 నుంచి 1989 వరకు జరిగిన ఎన్నికల్లో రెండు పర్యాయాలు టీడీపీ అభ్యర్థి చిన్నం జోగారావు విజయం సాధించారు. 1989 నుంచి టీడీపీ అభ్యర్థి శీతంశెట్టి వెంకటేశ్వరరావు మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2004లో టీడీపీ తరఫున పోటీచేసిన చిన్నం బాబురమేష్ విజయం సాధించారు. 2009లో జరిగిన ఎన్నికల్లో టికెట్ ఆశించి భంగపడిన శీతంశెట్టి వెంకటేశ్వరరావు ప్రజారాజ్యం తరఫున, టీడీపీ తరఫున చిన్నం బాబురమేష్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి కోసూరి కాశీవిశ్వనాథ్ విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టీడీపీ ఓటు బ్యాంకును ఇద్దరు చీల్చుకోగా, కాంగ్రెస్ అభ్యర్థి విజయం సునాయాసమైంది. 2014 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించింది. వైఎస్సార్ సీపీ గుర్తుతో విజయం సాధించిన వంతల రాజేశ్వరి రెండు సంవత్సరాల తరువాత టీడీపీలో చేరారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థి నాగులపల్లి ధనలక్ష్మి 39వేల ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో పోటీచేస్తున్న ఆమెకు మళ్లీ అదే మెజారిటీ వచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

నియోజకవర్గ స్వరూపం..

నియోజకవర్గంలో రంపచోడవరం, గంగవరం, దేవీపట్నం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై రామవరం, మారేడుమిల్లి, చింతూరు, వీఆర్ పురం, కూనవరం, ఎటపాక వెరసి 11 మండలాలున్నాయి. రంపచోడవరం నియోజకవర్గం 6,431 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంది. 140 పంచాయతీల పరిధిలో దాదాపు వెయ్యి గ్రామాలున్నాయి. నియోజకవర్గంలో రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి, గంగవరం, దేవీపట్నం, మారేడుమిల్లితో పాటు రాష్ట్ర విభజన అనంతరం విలీనం చేసిన చింతూరు, ఎటపాక, వీఆర్‌పురం, కూనవరం మండలాలతో వీటి సంఖ్య 11కు చేరింది. వీఆర్‌పురం మినహా అన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలను స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది.

ఆర్వోఎఫ్‌ఆర్‌తో వైఎస్సార్‌సీపీకి అనుకూలం

రంపచోడవరం నియోజకవర్గంలో విలీన మండలాలు కలిసిన తరువాత కోయదొర సామాజిక వర్గ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉంది. విలీన మండలాలు చేరకముందు ఏడు మండలాల్లో కొండరెడ్ల సామాజిక వర్గం సంఖ్య ఎక్కువగా ఉండేది. ప్రస్తుతం కోయదొర ఓటింగ్ సరళిని బట్టే అభ్యర్థుల మెజారిటీ ఆధారపడి ఉంటుంది. గిరిజనేతరుల ఓటింగ్ కూడా ప్రభావం అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఏజెన్సీలో పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతో గిరిజనులు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారు. ప్రభుత్వ పథకాలు, గిరిజనేతరుల ఓట్లు వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉన్నాయి.